**కథ**

**తుపాను ముందర తరువాత కూడా వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. మేము వచ్చినప్పటి నుండి ఇల్లు చాలా నిశ్శబ్దంగా ఉంది. అంత నిశ్శబ్దం భరించడం కూడా కష్టమేమో.**

**ఎవరి మొహాల్లో చూసినా వైరాగ్యం, ఏదో కోల్పోయిన అనుభూతి. జీవితం ఇంతేనన్న విషాదం వెరసి ఆ ఇల్లు శివాలయంలా ఉంది.**

నేను మా అమ్మతో అక్కడకు వచ్చి ఓ వారం పైనే అయ్యింది. ఈ వారం రోజులలో నేను విన్న మాటలు చాలా తక్కువ. అలానే నేను మాట్లాడింది కూడా. అమ్మ అయితే ఒకళ్లు పలకరిస్తేగానీ పెదవి విప్పట్లేదు.

అందరిలాగే బాధతో మౌనంగా ఉన్నాడేమో బావ, అనుకున్నాను కానీ పేలడానికి సిద్ధంగా ఉన్న

# రెండో కోణమ్

అగ్నిపర్వతం అనుకోలేదు.

''అసలు ఎందుకు వచ్చారు మీరు? ఇంకా పంపకాలకి ఏం మిగిలాయని?'' ఆవేశంతో ఊగిపోయాడు. వారంరోజులుగా తన గుండెల్లో దాచుకున్న ఈ కోపం, ద్వేషం ఒక్కసారిగా మా బావ ముఖంలోకి వచ్చి ముఖం వికృతంగా మారింది.

అంతవరకు అది తుపాను తరువాత ప్రశాంతతే అనుకున్నానుకానీ, రాబోయే తుపానుకి సంకేతం అని మాత్రం అనుకోలేకపోయాను. ఒక్కసారిగా బావ పేల్చిన అగ్నిపర్వతపు మాటల నుండి వెలువడిన లావాకంటే ఆ మాటలు విని నా కళ్లలో నుండి వెలువడిన కన్నీళ్లు వెచ్చగా నా బుగ్గల్ని తాకాయి. ఊహించని పరిస్థితి ఎదురయ్యింది. దాంతో నిశ్చేష్టుడనై నోటమాట రాక నిలుచుండిపోయాము. తేరుకుని జవాబు చెప్పేలోపే అమ్మ నా చేయి పుచ్చుకుని నన్ను గదిలోకి తీసుకువెళ్లింది.

''అదేంటమ్మా, నన్ను మాట్లాడనివ్వలేదు'' నెమ్మదిగా ప్రశ్నించాను.

''వాడు ఏ ఉద్దేశ్యంతో ఆ మాట అన్నాడో చూచాయగా తెలుస్తూనే ఉంది. అటువంటి పరిస్థితులలో మనం కూడా వెంటనే స్పందిస్తే మాటకు మాట పెరుగుతుందే తప్ప ప్రయోజనం ఉండదు. మనసు తెలుసుకునేందుకు ఆస్కారం ఉండదు. అందుకని మనకి ఇది మాట్లాడే సమయం కాదు. అవకాశం చూసి వాడి ఉద్దేశ్యం కనుక్కుందాం. ఈలోగా వాడూ కొంత ఊరట చెందుతాడు. మనం ఎందుకు మాట్లాడలేదోనని కొంత మనిషిగా ఆలోచించగలుగుతాడు. అందుకే అలా చేసాను. మనం సాధ్యమైనంత త్వరగా మనింటికి వెళ్లిపోవడం మంచిది''

అమ్మ దూరదృష్టికి ఆనందం కలిగింది. నిజమే, ఒక్కక్షణం మనలో కలిగే ఏ భావాన్నైనా అణుచుకుని ఆలోచిస్తే తప్పులు జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. అది అనుభవం నేర్పే పాఠం. దానికి ఎవరైనా తలవంచాల్సిందే.

అమ్మ మాటలకి అంగీకరించినట్టుగా తల ఊపాను. ఆ రాత్రంతా చాలా రకాల ఆలోచనలు నన్ను వశం చేసుకుని, దాదాపు ఇరవై సంవత్సరాల గతంలోకి తీసుకువెళ్లాయి.

★ ★ ★

''ఏంటమ్మా ఏమీ చెప్పవు, సరిగ్గా మాట్లాడవు, ఏమి అడిగినా తప్పించుకు తిరుగుతున్నావు?'' తాతయ్య గట్టిగా నిలదీసాడు అమ్మని.

''ఏమీ లేదు నాన్నా, ఈమధ్య కొంచెం నలతగా ఉంటోంది. నీరసంగా కూడా ఉంటోందని నాలుగు రోజులు ఉందామని వచ్చాను'' అమ్మ అసలు విషయానికి మసిపూస్తోందని తాతయ్యకు ఎప్పుడో అర్థమయింది.

''వద్దమ్మా అబద్ధం వద్దు. నేను నిన్ను కన్న తండ్రినని మర్చిపోతున్నావు. నువ్వు నా చేతులలో పెరిగినదానివి. నువ్వు చెబుతున్నది నిజమో, అబద్ధమో తెలుసుకోలేననుకోకు. ఇప్పటికైనా నిజం చెప్పు. నువ్వు వచ్చి అప్పుడే రెండు రోజులైంది. ఏదో చెప్పాలన్న ఆరాటం నీ కళ్ళల్లో కనిపిస్తోంది. నాకు కంటి భాష పూర్తిగా రాదమ్మా. కానీ నీ కంటి కాటుకను తడుపుతున్న నీ కన్నీరు నాకు కనిపిస్తోంది. ఏమైందమ్మా'' అమ్మ దగ్గర కూర్చొని అమ్మ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ లాలించారు.

అసంకల్పితంగా అమ్మకళ్లల్లో నీళ్లు తిరిగాయి.

''ఊరుకో తల్లీ, ఊరుకో'' అంటూ ''సావిత్రీ, కొంచెం మంచినీళ్ల పట్రా'' అన్నారు అమ్మమ్మను సంబోధిస్తూ. మంచినీళ్లు తాగి కాస్త కుదుటపడింది అమ్మ.

''ఇప్పుడు చెప్పమ్మా, భాస్కర్ ఏడి? తనెందుకు రాలేదు? అసలేమైంది?''

''నాన్నా ఆయన, తను చేస్తున్న బిజినెస్‌లో నష్టపోయారు. ప్రస్తుతం అప్పుల్లో ఉన్నాం. మొన్న వాళ్లెవరో ఇంటికి వచ్చి చాలా దారుణంగా మాట్లాడారు. ఇంతవరకు ఏదో కష్టాల్లో ఉన్నాం అనుకున్నానుకానీ, ఒకరిచేత మాట పడే స్థాయికి వచ్చామనుకోలేదు. ఆయన కూడా చాలా బాధపడ్డారు. ఆయన అందుకే ఇక్కడకు కూడా రాలేకపోయారు. నేనే ఆయనకు ధైర్యం చెప్పి నీ దగ్గరకు వచ్చాను. మాకో సాయం చేయాలి నాన్నా'' తల వంచుకొని ప్రార్థనగా అడిగింది అమ్మ.

''ఏంటమ్మా చెప్పు''

''మాకు... మాకు కొంత డబ్బు సాయం కావాలి నాన్నా. నిజానికి నిన్ను ఇలా అడగటం మాకు ఇష్టం లేదు. కానీ విధికి ఎదురీదలేం కదా. మేము నిలదొక్కుకున్నాక తిరిగి తీర్చేస్తాం. అప్పుగా కావాలి నాన్నా. ఇది అధికారంగా అడగట్లేదు, ఆప్యాయంగా మాత్రమే అడుగుతున్నాను'' తాతయ్య మొహంలోకి సూటిగా చూస్తూ చెప్పలేకపోతోంది అమ్మ.

కొంతసేపు నిశ్శబ్దం.

''ఏం నాన్నా, ఏ మాట చెప్పలేదు'' అమ్మ మొహంలో ఆందోళన.

''ఈ విషయం నాకు తెలుసమ్మా. నీ ద్వారా వినాలనే పట్టుపట్టి చెప్పించాను. నా దగ్గర చెప్పటానికి యింత ఆరాటపడ్డావా?'' కాస్త మందలింపు ప్రతిధ్వనించింది. మళ్లీ తాతయ్యే అందుకుంటూ ''నువ్వు నా తొలి సంతానానివి. నీ నోటనే మొదటిసారిగా నాన్నా అన్న పిలుపు విన్నవాడిని. నీకు లేదంటానా? రేపే ఏర్పాటు చేస్తాను. మనసులో ఏ ఆలోచనలు పెట్టుకోకుండా విశ్రాంతి తీసుకో'' అన్నారు తాతయ్య.

ఈ పై సంఘటనంతా నా కళ్లల్లో గుండెలకు హత్తుకొని మనసులో నిలిచిపోయే ఓ మరుపురాని దృశ్యంలా ఇప్పటికీ నా కళ్ళలో స్థిరంగా ఉంది. అప్పటికి నా వయసు పదేళ్లు. అప్పుడే హైస్కూలు చదువుకు వచ్చాను. విషయ సారాంశం సూక్ష్మంగా తెలుస్తూ ఉన్నా, వివరంగా తెలుసుకోలేని వయసు.

మా అమ్మ, మా మావయ్య ఇద్దరే తాతయ్యకు సంతానం. మా మావయ్య, అత్తయ్య కారు ప్రమాదంలో మరణించారు. అదే కారు ప్రమాదంలో



అదృష్టం కొద్దీ బయటపడినవాడు మా బావ. విధి విచిత్రానికి ఇదొక సాక్ష్యం. ఒకే కారులో ప్రయాణిస్తున్న వారిలో అందరూ చనిపోగా నెలల వయసున్న మా బావ మాత్రం నవ్వుతూ బయటపడగలిగాడు.

ఆనాటి నుండి నా సమవయస్కుడైన మా బావ అమ్మమ్మ ఒడిలోనే పెరిగాడు. ఆవిడ మళ్లీ తన కొడుకుని పెంచుతున్నట్లు వాడిని పెంచింది.

మా తాతయ్యకు స్వంత వ్యవసాయం ఉండేది. సెలవులు యిచ్చినప్పుడల్లా మా తాతయ్యగారింటికి వెళ్తూండేవాడిని. మా బావ ఏనాడూ ఎవరితోనూ సరిగా కలిసేవాడు కాదు. ఒంటరి మనస్తత్వం అనుకునే వాళ్లం. మా తాతయ్య కూడా చాలాసార్లు ఈ విషయమై వాడిని కోప్పడేవారు. ఈ సమయంలో వాడు తాతయ్యను చూసిన చూపునకు అర్థం తెలుసుకోవడానికి నిఘంటువు దగ్గర పెట్టుకొని వినడానికి కఠినంగా ఉండే పదాలన్నీ ఒక చోట రాసుకోవాలేమో అనిపించేది.

అన్నట్టుగానే తాతయ్య డబ్బు ఏర్పాటు చేసారు. కానీ అప్పుగా కాదు.

''అమ్మా, నేను కొడుకును ఏనాడో కోల్పోయాను. ఇంక మిగిలింది నువ్వే కనుక నీకు నా ఆస్తిలో కొంత యిద్దామనుకొంటున్నాను. అది ఏనాడో యిచ్చేకంటే మీకు అవసరమైనప్పుడు యివ్వటం సబబు. నా మనస్ఫూర్తిగా యిస్తున్నాను. మీరు అభివృద్ధి చెందటం కంటే నాకేం కావాలి? అదే మీరు నాకు యిచ్చే అసలు, వడ్డీ కూడా'' అంటూ దస్తావేజులు, డబ్బు అమ్మ చేతిలో పెట్టారు.

తాతయ్య మాటలకు అమ్మ ఒప్పుకోలేదు. ''నేను ఆస్తి పంపకానికి రాలేదు. నాకు అప్పు కావాలి నాన్నా. మీ ఆస్తిని పట్టుకుపోయానన్న పేరు నాకొద్దు'' అమ్మ కచ్చితంగా చెప్పింది.

''ఇదే పని నేను చేద్దామని అనుకుంటున్న సమయంలో నువ్వు డబ్బు కోసం రావటం కాకతాళీయం. అంతేకానీ నువ్వు రావటం వలన నేనీ పని చెయ్యట్లేదు. ఇలా జరగడానికి నువ్వు ఎంత మాత్రం కారణం కాదు. తీసుకో నా మాట కాదనకు'' తాతయ్య పలు రకాలుగా చెప్పి మొత్తానికి అమ్మను ఒప్పించారు.

ఎస్.ఎస్.వి.ఎ.కె.కుమార్

తరువాత ఆ డబ్బు తాతయ్య ఆశీర్వాద బలాన్ని నింపుకొని మమ్మల్ని ముందుకు తీసుకు వెళ్లింది. నాన్న జీవితంలో నిలదొక్కుకోగలిగారు. మళ్లీ దేని గురించీ వెనక్కి తిరిగి చూసుకునే పరిస్థితి రాలేదు. కానీ ఓరోజు గుండె జబ్బు నాన్నను మాకు అందని దూరానికి తీసుకుపోయింది. నాటినుండి బిజినెస్ నాపైన పడింది. మా బావకు చదువు అబ్బకపోవటంతో, మా తాతయ్య వాడిని తనతోపాటే పొలం పనులు చూడటానికి తీసుకువెళ్లేవాడు.

తాతయ్య పోయి ఒక వారం అయ్యింది. మేము వచ్చినప్పటి నుండి చాలా అసహనంగా అదో రకంగా తప్పించుకు తిరుగుతున్న బావను చూసి బాధపడుతున్నాడనుకున్నాం కానీ, మా రాక వాడి బాధకు కారణం అని ఊహించలేకపోయాము. ఆనాడు తాతయ్య అమ్మకు ఇచ్చిన ఆస్తిని దృష్టిలో పెట్టుకుని అలా అన్నాడని స్పష్టంగా తెలుస్తోంది.

★ ★ ★

అలా గతంలోకి తీసుకువెళ్లిన ఆలోచనలు మళ్లీ

నన్ను వర్తమానంలోకి తీసుకువచ్చాయి. చాలా భారంగా రేయి గడిచి తెల్లవారింది.

వెళ్లేముందు అమ్మమ్మకు చెప్పడానికి ఆమె దగ్గరకు వెళ్లాము. అమ్మమ్మకు చెప్పటానికి వెళ్లాం అన్న మాటేకానీ, ఆవిడకు చెప్పినా తెలియదు. పదేళ్ల నుండి తను ఎవరినీ గుర్తుపట్టలేకపోతోంది ఒక్క తాతయ్యను తప్ప. ఇప్పుడు ఆయన కూడా లేరు. ఇంటి విషయాలు వగైరాలు మాత్రమే కాదు, ఆవిడ ఆకలి విషయం కూడా ఆవిడకు తెలియదు. పెడితే తింటుంది. లేకపోతే గదిలో ఓ మూల కూర్చుని ఎటో చూస్తూ ఉంటుంది. అన్నీ దగ్గరుండి ఎవరో ఒకరు జాగ్రత్తగా చూసుకోవాలి. అమ్మ కాసేపు అమ్మమ్మతో మాట్లాడింది. మా అందరికన్నా, అమ్మ మాట్లాడుతుంటే కాస్త తలకాయ ఊపుతూ ఉంటుంది అమ్మమ్మ. అమ్మ మొహంలోకే చూస్తూ ఉంటుంది. అమ్మ, అమ్మమ్మ దగ్గర్నుంచి లేవబోతూ ఉండగా అమ్మ చెయ్యి పట్టుకుంది అమ్మమ్మ. మాకు చాలా ఆశ్చర్యం కలిగింది. మరి కొంచెంసేపు అక్కడ కూర్చొని లేచి నిలబడింది అమ్మ.

''బాబూ, నీతో మాట్లాడాలి'' అమ్మ బావతో అంది.

''మాట్లాడడానికి ఏముంది? ఇంకా ఏమేమి మిగిలిపోయాయనా?'' చాలా కరుగ్గా ఉంది వాడి కంఠం.

''ఎందుకంత విరిచినట్లు మాట్లాడుతున్నావు?'' అడిగింది అమ్మ.

''ఆప్యాయంగా మాట్లాడి ఎకరాలు పట్టుకుపోవడం నాకు రాదు''

''బాబూ, చిన్నవాడివి అలా మాట్లాడకూడదు. నేనేమీ తాతయ్యను ఆస్తి పంచమని అడగలేదు''

''నోరు తెరిచి అడగక్కర లేదు. తెలివైన దానివి కాబట్టి అదే అర్థం వచ్చేలా మాట్లాడి సాధించుకున్నావు'' విషపు నవ్వు నవ్వాడు.

''ఎందుకంత విడదీసి మాట్లాడతావు? పోనీ నాకు ఆస్తి యిచ్చాడనుకో తాతయ్య నీకేం నష్టం చేసాడు? నీ జీవితానికి సరిపడా నీకూ మిగిల్చాడు కదా?''

''ఎందుకివ్వలేదు. నా జీవితానికి సరిపడా యిచ్చాడు. నిజమే. కానీ ఏంటి, ఆస్తిని కాదు. ఈ ముసలిదానిని. ఏమీ తెలియదు, చావదు. ఎలా వేగాలో ఈవిడతో. అంతేలే బాధ్యతల కోసం కొందరు పుడతారు, హక్కుల కోసం కొంతమంది పుడతారు. మీది రెండవ జాతి'' నొక్కి పలికాడు బావ.

''ఏం మాటలు బావ? మనసును కష్టపెట్టేలా మాట్లాడటం గొప్పతనం కాదు. ఇందాకటి నుండి చూస్తున్నాను. అమ్మ ఎంత తగ్గి మాట్లాడుతున్నా నువ్వు ఎలా మాట్లాడుతున్నావో తెలుస్తోందా?'' కోపంగా ప్రశ్నించాను.

''అవును మరి, గొప్పలు, తప్పులు అనాథలకెలా తెలుస్తాయి?''

తక్కువ వాడిననే భావం వాడిలో ఉందని అప్పుడు అర్థమైంది.

''నువ్వు అనాథవి ఎందుకు అవుతావు? అమ్మమ్మ నిన్ను కళ్లల్లో పెట్టుకుని పెంచింది. కన్న కొడుకులా చూసింది'' యింకా నా మాట పూర్తి కాలేదు.

''తండ్రికి తొలి సంతానం మీద ప్రేమ ఎక్కువ ఉంటుందిట. దాన్ని నిజం చేస్తూ తాతయ్య ఆస్తిని ఈవిడకు పంచేసాడు. కొడుకులా పెంచారు అని అంటున్నావే, అలాంటి నాకు మిగిల్చిందేమిటీ? ఇదిగో ఈవిడను. బాధ్యతలు, బరువులు నాకు పంచారు. సుఖాలు, సరదాలు మీకు. ఎంతైనా అనాథని కదా, అడిగేందుకెవరు ఉంటారు?'' నా మాటకు అడ్డుపడ్డాడు.

వాడు పూర్తిగా న్యూనతాభావంలో కూరుకుపోయాడనీ, దానినుండి బయటపడడనీ నాకు అర్థమైంది.

''బాధ్యతలు పంచారని పదే పదే అంటున్నావు. నిన్ను తల్లిదండ్రులు పోయిన నాటి నుండి కళ్లల్లో పెట్టుకు పెంచింది అమ్మమ్మ.

నీకు సర్వసేవలు చేసి నిన్నీ స్థితికి తీసుకువచ్చింది.

తాతయ్య కూడా నీకు తక్కువేం చెయ్యలేదే? నీ కాళ్లమీద నువ్వు స్వతంత్రంగా నిలబడగలిగే ఆధారం నీకు మిగిల్చాడు.

కాకపోతే అమ్మమ్మను చూసే బాధ్యత తప్ప ఏమున్నాయి బాధ్యతలు? అది నీకు నిజానికి బాధ్యత కాదు.

నీకు ఋణం తీర్చుకునే అవకాశం. ఏమిచ్చి ఆవిడ ఋణం తీర్చుకోగలవు?

ఎంతో సంతోషంగా స్వీకరించాల్సిన బాధ్యతను బరువుగా భావించి బంధాలు తెంపుకుంటావా?'' నిలదీసాను బావను.

''అన్నన్ని అవకాశాలు నాకు వద్దు. అయినా అంత సంతోషపడే విషయం ఏమీ లేదు యిందులో.

నీకేం ఎన్నయినా చెప్తావు. ఇలాంటి పరిస్థితి ఎదురైతే నువ్వు అప్పుడూ ఇలాగే మాట్లాడతావా? యిలాగే చేస్తావా?'' ఎదురు ప్రశ్నించాడు.

''నేను నీలాగా బాధపడను. వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకుంటాను'' నిక్కచ్చిగా చెప్పాను.

''చెప్పడం కాదురా, చేసి చూపించాలి. ఈవిడ బాధ్యత నువ్వు తీసుకోగలవా?'' అసలు బాణం అది.

ఈ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించటం కోసం మొదటి నుండి సాధారణ అస్త్రాలతో యుద్ధానికి దిగాడు.

ఇప్పుడు చివరగ దీనిని ప్రయోగించాడు.

''సంతోషంగా.

ఇకపైన అమ్మమ్మను నీవంటి రాక్షసుల దగ్గర ఉండనివ్వను.

మామయ్య పోయిన తరువాత నిన్నే కొడుకనుకుని పెంచింది.

ఇష్టమైనవాళ్లు ఎప్పుడో అప్పుడు కష్టపెడతారట. దాన్ని నువ్వు నిజం చేసావు.

దేవుడు యింతకాలం ఆవిడకు అన్యాయం చేసాడని అనుకున్నాను. కానీ నువ్విలా లాభనష్టాలు బేరీజు వేసుకునే లోభిగా, కృతఘ్నుడిలా మారడం ఆవిడ చూడకుండా ఉండేందుకేనేమో బహుశా ఈ జబ్బు యిచ్చాడు అమ్మమ్మకి.

ఇందాక అమ్మమ్మ అమ్మ చెయ్యి పుచ్చుకున్నది కూడా ఇందుకేనేమో.

'నన్ను ఈ వెధవ నుండి తీసుకుపోవా' అని చెప్పలేక చెప్పిందనుకుంటా.

తండ్రికి తొలి సంతానం మీద ప్రేమ ఎక్కువని అన్నావు.

అలాగే కూతురు కొడుకు తన కొడుకు తరువాత కొడుకంతటివాడని కూడా అంటారు. నువ్వు కేవలం ఆస్తికి మాత్రమే వారసుడివి.

నేను మాత్రం ఆప్యాయతలకి వారసుడిని. అమ్మమ్మకు కన్నకొడుకు లేకపోయినా ఆవిడకు రెండవ కొడుకుని నేను బతికే ఉన్నాను. అమ్మమ్మ నా దగ్గర దర్జాగా ఉంటుంది. గుడ్ బై'' అంటూ మా అమ్మమ్మ చెయ్యి పట్టుకుని అమ్మతో సహా గుమ్మం దిగాను.

♣

